క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులో సోమవారం మాఘ మాస అమావాస్య సందర్భంగా శ్రీలక్ష్మీకుబేర స్వర్ణాకర్షణ భైరవ స్వామి ట్రస్టు నిర్వాహకుడు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోరుమామిళ్ల : పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతు కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ విజయకుమార్‌రెడ్డి, ఏఈఈ వెంకట మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోరుమామిళ్ల టౌన్, సిద్దవరం, టేకూరుపేట, చెన్నారెడ్డిపేట, కోడిగుడ్లపాడు ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ విజయ్‌రామరాజు హాజరుకానున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని సూపరింటెండెంట్ కోరారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో సోమవారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డిని సీఐ అభినందించారు. అనంతరం వృద్ధులకు అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు సుబ్బరాయుడు, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

రేపు సెబ్ స్టేషన్‌లో వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 22న బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. వివరాలకు జమ్మలమడుగు రోడ్డులోని సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

23న ఆర్టీఓ కార్యాలయంలో

ప్రొద్దుటూరులోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో ఈ నెల 23న వాహనాల బహిరంగ వేలం వేయనున్నట్లు ఆర్టీఓ సుశీల తెలిపారు. 10 వస్తు రవాణావాహనాలు, 8 మోటార్ బైక్‌లను వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు రూ. 5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించాలని వివరించారు.

23 వరకు ఎమ్మెల్సీ ఓటు నమోదు అవకాశం

చాపాడు : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఓటు నమోదు కోసం ఈ నెల 23వ తేదీ వరకూ అవకాశం ఉందని తహసీల్దారు సుభానీ తెలిపారు. అర్హత కలిగి ఉండి దరఖాస్తు చేసుకోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉంటే ఆన్‌లైన్‌లో కానీ, నేరుగా దరఖాస్తులను మండల రెవెన్యూ కార్యాలయంలో గానీ అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

భూ వివాదంపై ఇరువర్గాలపై కేసు

కాశినాయన : మండలంలోని చెన్నవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ నాగిరెడ్డి, అదే గ్రామానికి చెందిన దస్తగిరిలు భూమి విషయమై సోమవారం గొడవపడ్డారు. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు రిటైర్డ్ వీఆర్‌ఓ నాగిరెడ్డి తనకు ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని తయారు చేసి పండ్ల మొక్కలు నాటారు. అదే గ్రామానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి ఈ పొలం నాది అంటూ గొడవ పడ్డారని తెలిపారు. ఇద్దరిని స్టేషన్‌కు పిలిపించి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అయితే దస్తగిరి తిరిగి వెళ్ళి మొక్కలను పీకివేశాడని, దీంతో దస్తగిరితో పాటు అతని అనుచరులపై రెండవ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ భూమి ఎవరికి చెందుతుందనేది రెవెన్యూ అధికారులకు తెలిపామని, తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈ-పంట నమోదుకు నేటితో గడువు ముగింపు

గోపవరం : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు ఈ-పంట నమోదు మంగళవారంతో గడువు ముగియనుందని వ్యవసాయాధికారి అరవిందనాయక్ తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాలకు వెళ్ళి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

నీటి సమస్యకు పరిష్కారం

పోరుమామిళ్ల : పట్టణంలోని శివాలయం నుంచి కొలిమివీధి దర్గా వరకు డ్రైనేజీ మరమ్మతులతో పైప్‌లైన్ దెబ్బతని రెండు నెలలుగా ఆ ప్రాంతంలోని ప్రజలు నీరందక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో శీనప్పబావివీధి వాసులు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు కూడా దిగారు. ఎట్టకేలకు సోమవారానికి కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేయడంతో నీటి సరఫరాకు ఆటంకం తొలగిపోయింది.

నమో వీరబ్రహ్మేంద్రస్వామి

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు

బ్రహ్మంగారిమఠం : 'నమో వీరబ్రహ్మేంద్రస్వామి' అంటూ భక్తులు ప్రణమిల్లారు. బ్రహ్మంగారిమఠంలో శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు నాలుగు రోజుల నుంచి కనుల పండువగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం నిత్య హోమం, వాస్తుహోమం, బలిహరణం, గజోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహాప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని చెన్నైలోని క్రోమ్‌పేటలో సుభాష్ నగర్ అమ్మాళ్ వీధికి చెందిన దత్తాత్రేయశర్మ సతీమణి సూర్యకుమారి చేపట్టారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వీకరించారు. రాత్రి పుష్పరథోత్సవం చూడ ముచ్చటగా సాగింది. దేవదాయశాఖ ఏసీ, మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి పర్యవేక్షణలో, ఇడమకంటి జనార్దన శివాచార్య, పడకండ్ల వెంకటాచార్యులు, పాలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. దివంగత మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర



పుష్పరథోత్సవంలో కొలువు దీరిన స్వామి, అమ్మవారు

స్వాముల వారి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, శ్రీ వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయ స్వామి, వరదరాజస్వామి, శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వాముల సోదరులు వీరభద్రస్వామి చేతుల మీదుగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదాతలు చెన్నైలోని అన్నానగర్‌కు చెందిన పురుషోత్తం, సుధాకర్, ధర్మ ప్రచారకర్త బ్రహ్మశ్రీ వడ్లమాని జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరీదేవిమఠంలో..

బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీపార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు నాలుగు రోజులుగా ఘనంగా జరిగాయి. చివరి రోజైన సోమవారం ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నైవేద్య, మంత్రపుష్ప, నీరాజన తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తులకు మహాప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరులోని అరండల్‌పేటకు చెందిన ఇంకొల్లు గోవిందయ్యాచార్యులు సతీమణి వరలక్షుమ్మ చేపట్టారు. సాయంత్రం అభిషేకం, కుంకుమార్చన, రాత్రి నైవేద్య, మంత్రపుష్ప, నీరాజన తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మఠాధిపతులు శ్రీ వీరశివకుమార స్వాములు ఆధ్వర్యంలో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మల్లేలమ్మ వార్షికోత్సవం

రాజుపాళెం: మండలంలోని వాసుదేవపురం గ్రామంలోని మల్లేలమ్మ తల్లి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మల్లేలమ్మకు ప్రత్యేక పూజలు, చేశారు. ఆలయ నిర్వాహకులు సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, గ్రామస్తులు పూజలు చేశారు.

సమస్యల పరిష్కారం కోసమే 'స్పందన'

గోపవరం : సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు, తహసీల్దారు దామోదర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు ఒకేచోట స్పందన కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఎలాంటి సమస్యలైనా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అంతేకాకుండా గ్రామ సచివాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం ఉంటుందని, అక్కడ కూడా అర్జీలు ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అన్నిశాఖల అధికారులతో వారు చర్చించారు. ముఖ్యంగా గడువులోపల జగనన్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో సకాలంలో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. మార్చి 23న సామూహిక గృహ ప్రవేశాలు ఉన్నందున ఆలోపు ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేయాలన్నారు. వారం వారం ఇళ్ళ నిర్మాణాలపై పురోగతి కనిపించేలా ఎప్పటికప్పుడు జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవింద నాయక్, పీఆర్ ఏఈ చిట్టిబాబు, ఈఓపీఆర్డీ హసీనా, పశువైద్యాధికారి క్రిష్ణవేణి పాల్గొన్నారు.



స్పందనలో పాల్గొన్న అన్నిశాఖల అధికారులు

పాఠశాలల విలీన ప్రతిపాదనతో నష్టం

బి.కోడూరు : పది మందిలోపు పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనలు విద్యావ్యవస్థకు తీరని నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జెడ్.జయరామయ్యలు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం బి.కోడూరులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు కనుమరుగై బడుగు, బలహీన, అణగారిన పేద వర్గాల వారికి విద్య దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు బాలరాజు, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, రమణమూర్తి, పుల్లయ్య, రాజగోపాల్‌రెడ్డి, కుమార్‌బాబు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

- ఎమ్మెల్సీగా గెలిస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి మద్దతు కోరారు. అనంతరం గురాజి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ భావితరాల భవిష్యత్తును గుర్తించి విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించి మనబడి నాడు-నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ఏటా రూ.15వేలు చెల్లిస్తున్నారన్నారు. 36 సంఘాల మద్దతుతో తాను ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. 22న అనంతపురంలో జరిగే తన నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని ఉపాధ్యాయులను కోరారు. స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్, అపుస్మా పట్టణాధ్యక్షుడు కె.దేవిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, పట్టణ కమిటీ గౌరవాధ్యక్షుడు హరికృష్ణ, అధ్యక్షుడు వినోద్, గురాజి పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, నాయకులు రామ్మోహన్, లక్ష్మి చౌడయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి

రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం

బద్వేలు అర్బన్/ బి.కోడూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా సోమవారం ఆయన సోదరులు బద్వేలు పట్టణంతో పాటు బి. కోడూరు మండలంలోని వివిధ సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వెన్నపూస జగన్‌మోహన్‌రెడ్డి, వెన్నపూస హర్షవర్ధన్‌రెడ్డిలు మాట్లాడారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఆర్డీఓ ఆకులవెంకటరమణ

బద్వేలు అర్బన్ : స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓ ఆకులవెంకటరమణ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారులు వివిధ రకాల సమస్యలపై తమ అర్జీలను సమర్పించారు. అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అనంతరం సంబంధిత అధికారులకు అర్జీలను బదలాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా మండలాల్లో ఫిర్యాదుదారుల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, వారిని పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు సూచించారు. అర్జీదారులు కూడా గ్రామ, వార్డు స్థాయిలో, మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటేనే డివిజన్ కార్యాలయానికి రావాలని, వ్యయప్రయాసలకు గురికావద్దని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీఓకు సమస్యను వివరిస్తున్న మహిళ

టీసీసీ చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : మండలంలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని కొత్తకొట్టాలలో నూతనంగా నిర్మించిన టీసీసీ చర్చిని సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి ప్రారంభించారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్‌లను చర్చి సంఘ పెద్దలు సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

20 ఏళ్ల సమస్యను పరిష్కరించాం

టీసీసీ చర్చి నిర్మాణం కోసం ఈ ప్రాంత క్రైస్తవులు 20 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారని, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సమస్యను పరిష్కరించి చర్చి నిర్మాణం కోసం 9 సెంట్ల స్థలాన్ని కేటాయించడంతోపాటు ఆర్థిక సహాయం అందించామన్నారు. సర్పంచ్ ప్రశాంతితోపాటు క్రైస్తవ సంఘం పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే రాచమల్లును సన్మానిస్తున్న చర్చి పెద్దలు

పంట నమోదు గడువును సద్వినియోగం చేసుకోవాలి

అట్లూరు : రైతులు పంట నమోదు గడువును సద్వినియోగం చేసుకోలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సాగు చేసిన పంటలకు ఈనెల 28 లోపు పంట నమోదు కార్యక్రమంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సోమవారం అట్లూరు రెవెన్యూ పొలంలోని రబి సీజన్ పంట నమోదు చేసిన వివరాలతో పాటు పొద్దుతిరుగుడు, నువ్వుల పంట సాగును వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఎక్కడైనా పంటలు సాగులో ఉండి నమోదు చేయలేదా, పంటలు సాగు చేయకుండానే పంటలు ఉన్నట్లు పంట నమోదు చేశారా అని ఆరాతీశారు. కార్యక్రమంలో బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, సిద్దవటం రమేష్‌రెడ్డి, రైతు భరోసా వ్యవసాయ సహాయకులు లక్ష్మీదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గోపవరం : మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులుగా నిర్వహించిన మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వచ్చిన భక్తులకు కొండపైన అధికారులు అన్ని వసతులు కల్పించారు. దేవదాయశాఖ, పాలక మండలి కొండపైన ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కొండపైన నీటి వసతి ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. వైద్యం, పారిశుద్ధ్యం, భద్రతపై అన్ని చర్యలు తీసుకున్నారు. కొండపై, కొండ కింద వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు రక్షణ కల్పించారు. బ్రహ్మోత్సవాలకు దాదాపు 35 వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. సోమవారం రాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఓబుల్‌రెడ్డినగర్ (మూడిళ్లు) వద్ద మల్లెంకొండేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

దువ్వూరు : మండలంలోని గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. దువ్వూరులోని మండల పరిషత్ సభాభవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో వ్యవసాయ మోటార్లకు సరఫరా చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను, నేడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నాగేంద్రబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య ఉపాధ్యాయులకు పిలుపిచ్చారు. సోమవారం మహాసభల పోస్టర్లను ఉపాధ్యాయ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ మార్చి 5, 6 తేదీల్లో నెల్లూరులో ఆపస్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా నాయకులు రమణయ్య, బాలరంగయ్య, రామకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తహీనత ప్రమాదకరం

మైదుకూరు : రక్తహీనత చాలా ప్రమాదకరమైనదని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. అనీమియా ముక్త్ భారత్ (ఏఎంబీ) కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని జీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనీమియా రికార్డులను పరిశీలించిన ఆయన హైరిస్క్ గర్భిణులతో మాట్లాడి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాలో 25 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలిపారు. నిరంతరం వైద్య సిబ్బంది రక్తహీనతపై అవగాహన కల్పిస్తూ, తీసుకునే ఆహారంలో ఐరన్ ఉండేలా సలహాలు ఇవ్వాలన్నారు.

వీరభద్రస్వామి శివరాత్రి ఆదాయం లెక్కింపు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా శని, ఆదివారాల్లో వచ్చిన కానుకలు, నగదును లెక్కించారు. ఆలయ చైర్మన్ టీజీ వెంకట సుబ్బారెడ్డి, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.2.87 లక్షలు, వీరభద్రస్వామి దర్శన టికెట్‌ల ద్వారా రూ.1.51 లక్షలు, అంగళ్ల ద్వారా రూ.41 వేల చొప్పున మొత్తం రూ.4.79 లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో డీటీ, ఇన్‌చార్జి తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డిని ఆయన కలిసి మాట్లాడారు. మండలంలో అధికంగా ప్రభుత్వ భూములకు చెందిన సమస్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు అధికంగా రెవెన్యూ సమస్యలు దృష్టికి తెచ్చారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రొద్దుటూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సతీమణి రాచమల్లు రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని యానాది కాలనీ, జేమ్స్ కొట్టాలు, కేవీఆర్ కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, సోములవారిపల్లె సర్పంచ్ ప్రశాంతి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ పేరం సునీత, కన్సూమర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలు గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

మైదుకూరు : పట్టణంలోని శాంతినగర్‌లో థామస్ సీఎస్‌ఐ చర్చి 16వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ఎ.జయరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు నామినేషన్

ప్రొద్దుటూరు క్రైం : రాయలసీమ రాష్ట్ర సమితి తరపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి అభ్యర్థిగా మునగల అశోక్‌కుమార్‌రెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 22న ఉదయం అనంతపురం జిల్లా కలెక్టర్ ఆఫీసులో నామినేషన్ వేస్తున్నట్లు ఆయన అన్నారు. మేధావులు, పట్టభద్రులు, సన్నిహితులు నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.